జగనన్నతోనే పేదల సంక్షేమం

- అభివృద్ధిని చూసి మరోమారు ఆశీర్వదించండి
- ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

నల్లమాడ: సీఎం జగనన్నతోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, పేదలకు సంక్షేమ ఫలాలు అందాయని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. గోపేపల్లి గ్రామ సచివాలయ పరిధిలోని గోపేపల్లి, గోపేపల్లి తండా, రాగానిపల్లి, రాగానిపల్లి తండా గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి నాలుగున్నర సంవత్సరాల్లో నవరత్నాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. సమస్యలపై ఆరా తీశారు. గోపేపల్లిలో నిర్మించిన సీసీ రోడ్లకు సక్రమంగా క్యూరింగ్ చేయకపోవడాన్ని ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి గుర్తించారు. సంబంధిత శాఖ ఉన్నతాధికారులు గోపాల్‌రెడ్డి, విశ్వనాథరెడ్డిపై ఫోన్‌లో ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యత పాటించకుండా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనంతగా నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామన్నారు. పుట్టపర్తి కేంద్రంగా సత్యసాయి జిల్లా సాధించుకోవడమే గాక ఓడీ చెరువు, పుట్టపర్తి, నల్లమాడ మండలాల మీదుగా గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే, ముదిగుబ్బ నుంచి బుక్కపట్నం, పుట్టపర్తి మీదుగా చెక్‌పోస్టు వరకు నాలుగు వరసల రోడ్డు, కదిరి నుంచి నల్లమాడ, ఓడీ చెరువు మీదుగా నాలుగు వరుసల రోడ్డు పనులు జరుగుతున్నాయన్నారు. 193 చెరువులను కృష్ణా జలాలతో నింపేందుకు శ్రీకారం చుట్టామన్నారు. రెండుచోట్ల డ్యాంల నిర్మాణం, 25 వేల పక్కాగృహాల నిర్మాణం పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. మరోమారు జగనన్నను గెలిపించి నియోజకవర్గంలో తనను ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కోరారు. సర్పంచ్ రోహిణి, ఎంపీటీసీ జయమ్మ, ఎంపీపీ డుంగావత్ సునీతాబాయి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కే.సూర్యనారాయణ, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు ఎంజే మోహన్‌రెడ్డి, నాయకులు ముక్తాపురం రమణారెడ్డి, సాంబశివారెడ్డి, రఘునాథరెడ్డి, తోలేటి ఆదినారాయణరెడ్డి, దాదిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎస్. ఉత్తమరెడ్డి, దేవళానాయక్, సీ.ఆదినారాయణరెడ్డి, దాదిరెడ్డి భాస్కర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, ఆదినారాయణ, ఎం.రామచంద్ర, మనోహర, ఆనంద్ పాల్గొన్నారు.

ఇప్పుడే బాగుంది సారూ

ఏం పెద్దమ్మా బాగున్నావా, ఒకటో తారీఖునే పింఛన్ అందుతోందా అంటూ గోపేపల్లిలో ముక్తాపురం నరసమ్మ అనే వృద్ధురాలిని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ఆరా తీశారు. వృద్ధురాలు స్పందిస్తూ తెల్లారగానే వలంటీర్ వచ్చి పింఛన్ ఇస్తున్నాడు, టీడీపీ ప్రభుత్వంలో మునిలోల్లం దరమూ పోయి రాగిమానికాడ కూర్చొంటే పింఛనీ చేతికొచ్చేసరికి రెండు, మూడు రోజులు పట్టేది, ఇప్పుడంతా బాగుంది సారూ, మళ్లా జగనే రావల్ల అంటూ పేర్కొంది.

క్లుప్తంగా

అయోధ్య అక్షింతల ఊరేగింపు



అక్షింతలను ఊరేగిస్తున్న దృశ్యం

బత్తలపల్లి: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అయోధ్య నుంచి తెప్పించిన అక్షింతలను ఆదివారం బత్తలపల్లి పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అక్షింతలను తొలుత అయ్యప్ప స్వామి ఆలయం వద్ద ఉంచి అక్కడి నుంచి శివాలయం వరకు భజనలు చేస్తూ ఊరేగింపు నిర్వహించారు. అయ్యప్ప మాలధారులు, శివ భక్తులు జై శ్రీరాం అంటూ నినాదాలు చేశారు.

ఉత్సాహంగా బ్రాహ్మణుల కార్తీక వన భోజనాలు



వనభోజనాలు చేస్తున్న బ్రాహ్మణులు

కదిరి: కదిరి–పులివెందుల రోడ్‌లోని కరణం వారి తోటలో ఆదివారం ఖాద్రీ క్షేత్ర బ్రాహ్మణ సమైక్య సేవా సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలు ఏర్పాటు చేశారు. కదిరి, పరిసర మండలాల్లోని బ్రాహ్మణులు పెద్ద సంఖ్యలో పాల్గొని రోజంతా ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా పిల్లలు, మహిళలకు స్కిప్పింగ్, మ్యూజికల్ చైర్స్, బాస్కెట్‌బాల్, స్పీడ్‌వాక్, పరుగుపందెం, వృద్ధులకు నడక పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

గొడవలకు దూరంగా ఉండండి

బత్తలపల్లి: రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గొడవలకు దూరంగా ఉండాలని గ్రామస్తులకు ధర్మవరం రూరల్ సీఐ ఆరోహణరావు, ఎస్‌ఐ శ్రీనివాసులు సూచించారు. ఈదుల ముష్టూరు, రాఘవంపల్లి గ్రామాలలో ఆదివారం తెల్లవారుజామున కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సూరీ అనే వ్యక్తి ఇంట్లో 10 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. రౌడీ షీటర్ల ఇళ్లలోనూ తనిఖీలు నిర్వహించారు.

నేడు 'స్పందన'

గాండ్లపెంట: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం 'స్పందన' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

బత్తలపల్లి: అన్ని గ్రామ సచివాలయాల్లో సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ యుగేశ్వరిదేవి తెలిపారు.

తలుపుల: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ కే.శ్రీధర్ తెలిపారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి

కదిరి టౌన్: పట్టణ నివాస ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎన్జీవో హోంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా మున్సిపాలిటీ, నగర పంచాయతీల్లో పేదలు నివసించే ప్రాంతాల్లో రోడ్డు, తాగునీరు సౌకర్యాలు కల్పించి సమస్యలు పరిష్కరించాలన్నారు. బడా సుబ్బిరెడ్డి, నరసింహులు, జగన్మోహన్, ముస్తాక్, బాబాజాన్ పాల్గొన్నారు.

కంటి వైద్య పరీక్షలు



కనగానపల్లిలో కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

కనగానపల్లి: మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరంలో 260 మందికి కంటి పరీక్షలు చేసినట్లు నిర్వాహకులు అంకే అశోక్ తెలిపారు. వైఎస్సార్ కడప పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్య బృందం ఈ శిబిరం నిర్వహించారు. వీరికి అంకే అశోక్ సహకారం అందజేశారు.

ధర్మవరం అర్బన్: శివానగర్ సచివాలయంలో విశ్రాంత కంటి వైద్యాధికారి డాక్టర్ నరసింహులు చేనేత కార్మికులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. జాతీయ చేనేత మహిళా నాయకురాలు జయశ్రీ, కౌన్సిలర్ కేతా లోకేష్ పాల్గొన్నారు.

రామాలయానికి విరాళం



పూజలు నిర్వహిస్తున్న కుటుంబ సభ్యులు

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి మండలం సుబ్బరాయనిపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయానికి ఉద్యోగరీత్యా హిందూపురంలో స్థిరపడిన దివంగత రాయళ్ల చంద్రశేఖరప్ప కుమారులు టీచర్ గురుప్రసాద్, అమెరికాలో ఉన్న వెంకటేశ్వరబాబు, శ్రీనాథ్, తల్లి మీనాక్షమ్మ రూ.లక్ష విరాళం ప్రకటించారు. ఆదివారం గ్రామానికి విచ్చేసి ఆలయం వద్ద పూజలు నిర్వహించి కమిటీ సభ్యులకు విరాళాన్ని అందజేశారు.

నేడు 17వ వార్డులో 'వై ఏపీ నీడ్స్ జగన్'

కదిరి: వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని సోమవారం సాయంత్రం 5.30 గంటలకు పట్టణంలోని 17వ వార్డులో ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కొలిమి జిలాన్ ఆదివారం తెలిపారు. నానా దర్గా రోడ్డు ప్రాంతంలోని 15వ సచివాలయ పరిధిలో జరిగే ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు హాజరు కావాలని కోరారు.

నేడు 'గడప గడపకూ...

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి రూరల్ మండలం గంగిరెడ్డిపల్లి సచివాలయ పరిధిలోని గంగిరెడ్డిపల్లి, దిగువచెర్లోపల్లి, సాతార్లపల్లి గ్రామాల్లో సోమవారం ఉదయం 8 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఉంటుందని ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, కన్వీనర్ నరసారెడ్డి తెలిపారు. పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి హాజరవుతారన్నారు.

నేడు సీసీ రోడ్డు ప్రారంభం

కదిరిటౌన్: కదిరి బ్రాహ్మణపల్లి పంచాయతీ పరిధిలోని కుమ్మరవాండ్లపల్లి నుంచి దిన్నెమీదపల్లి వరకూ నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును సోమవారం ఎమ్మెల్యే సిద్దారెడ్డి ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలిరావాలని కోరారు.

వాల్మీకులను వంచించింది పరిటాల కుటుంబమే



విలేకరులతో మాట్లాడుతున్న చెన్నేకొత్తపల్లి వాల్మీకి సంఘం నాయకులు

చెన్నేకొత్తపల్లి: స్వార్థ రాజకీయాలకు వాల్మీకులను వాడుకొని వంచించిన ఘనత పరిటాల కుటుంబానికే చెందుతుందని మండల వాల్మీకి సంఘం నాయకులు ఆరోపించారు. ఆదివారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో మండల వాల్మీకి సంఘం నాయకులు ఎంపీపీ అంజలితో కలిసి విలేకరులతో మాట్లాడారు. పెనుకొండ, రాప్తాడు నియోజకవర్గాల్లో పరిటాల కుటుంబ సభ్యులు పరిటాల రవీంద్ర, సునీతమ్మ 25 ఏళ్ల పాటు ఫ్యాక్షన్, వర్గ రాజకీయాలు నడిపారన్నారు. ఈ సందర్భంలో వారి పక్షాన ఉన్న వాల్మీకులను తమ స్వార్థ ప్రయోజనాలకు వాడుకొని వదిలేశారన్నారు. ఇకనైనా రాప్తాడు నియోజక వర్గంలోని వాల్మీకులు.. పరిటాల కుటుంబం మోసాలను గుర్తించి బయటకు రావాలని కోరారు. పరిటాల కుటుంబం గురించి గొప్పగా మాట్లాడుతున్న టీడీపీ నాయకులు వారు చేసిన హత్యా రాజకీయాలపై కూడా మాట్లాడాలన్నారు.

ఆటో బోల్తా... దంపతులకు గాయాలు

ధర్మవరం రూరల్: ఆటో బోల్తాపడి దంపతులు గాయపడ్డారు. వివరాలు.. కక్కలపల్లి గ్రామానికి చెందిన దంపతులు అక్కులప్ప, నాగేంద్రమ్మ కొత్తచెరువు మండలం తలమర్ల గ్రామానికి ఆటోలో వెళ్తుండగా మండలంలోని తుంపర్తి వద్దకు రాగానే వాహనం అదుపు తప్పి రోడ్డు పక్క గుంతలోకి దూసుకెళ్లి బోల్తా పడింది.అక్కులప్ప తలకు తీవ్ర గాయాలు కాగా నాగేంద్రమ్మకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని అనంతపురం ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి కృషి



పవన్‌కుమార్‌రెడ్డి సమక్షంలో శ్రీరాములును సన్మానిస్తున్న దృశ్యం

కదిరి: విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి జగనన్న ప్రభుత్వం కృషి చేస్తోందని, తన వంతు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తానని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు, వాల్మీకి విద్యాసంస్థల అధినేత పవన్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక వికలాంగుల భవనంలో ఆదివారం విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి పవన్ ప్రసంగించారు. విభిన్న ప్రతిభావంతులకు సామాజిక భద్రత కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.3 వేల నుంచి రూ.10 వేల వరకూ పింఛన్లు అందజేస్తున్నట్లు చెప్పారు. డిగ్రీ పూర్తి చేసి పోటీ పరీక్షలు రాసే విభిన్న ప్రతిభావంతులకు నిపుణులతో శిక్షణ, ఉచిత బస్‌పాస్‌ను కూడా ఇప్పిస్తానని తెలియజేశారు. తమ పాఠశాలలో దివ్యాంగులైన విద్యార్థులకు 10వ తరగతి వరకూ ఫీజుల్లో రాయితీ ఇస్తానని హామీ ఇచ్చారు. అంతకు మునుపు దివ్యాంగులు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. రాయలసీమ బీసీ ఐక్య సంఘాల వేదిక అధ్యక్షుడు గోశాల శ్రీరాములు, ఖాద్రీ దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ, కార్యదర్శి రామానుజులు, ఉపాధ్యక్షుడు అంజి, సంయుక్త కార్యదర్శి గోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ వాసుదేవన్

పుట్టపర్తి: బుక్కపట్నం పోలీస్ స్టేషన్‌ను పుట్టపర్తి డీఎస్పీ వాసుదేవన్ ఆదివారం తనిఖీ నిర్వహించారు. రికార్డులు పరిశీలించారు. పెండింగ్ కేసులపై ఆరా తీశారు. శాంతి భద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. జూదం, మట్కా, అక్రమ మద్యం రవాణాపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. పుట్టపర్తి రూరల్ సీఐ రామయ్య, ఎస్‌ఐ నరసింహుడు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

కదిరి: ముఖ్యమంత్రి సహాయ నిధికి సంబంధించిన రూ.9.25 లక్షల విలువ చేసే చెక్కులను కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ఆదివారం బాధితులకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జగనన్న ప్రభుత్వం పేదల వైద్యం కోసం పెద్ద మొత్తంలో నిధులు వెచ్చిస్తోందన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఎంతోమందికి కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందిస్తోందని చెప్పారు. ఆరోగ్యశ్రీలో లేని కొన్ని వ్యాధులకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం అందుకున్న వారికి ఆ డబ్బు మొత్తం ప్రభుత్వమే ఇలా సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల ద్వారా అందజేస్తోందన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా కూడా ఇప్పుడు రూ.25లక్షల దాకా కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచితంగా వైద్యం అందుకోవచ్చని గుర్తు చేశారు. అనంతరం చెక్కులు అందుకున్న లబ్ధిదారులందరూ ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలియజేశారు.

నల్లచెరువు: మండల పరిధిలోని తిరుమల దేవర పల్లి గ్రామానికి చెందిన సానే ధనుంజయరెడ్డికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 2లక్షలు, అదేవిధంగా బాలేపల్లి తండాకు చెందిన శాంతమ్మకు రూ.65 వేల చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ఆదివారం తన కార్యాలయంలో అందజేశారు. నల్లచెరువు మాజీ సర్పంచ్ ఎం.రవికుమార్‌రెడ్డి, నాయకులు సానే హరినాథ్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, హైటెక్ రమణ నాయక్, బాలకృష్ణ నాయక్ పాల్గొన్నారు.

యాదవులను గుర్తించిన పార్టీలకే మద్దతు



ఆత్మీయ సభలో సమావేశమైన యాదవ కులస్తులు

పుట్టపర్తి టౌన్: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో యాదవులను గుర్తించిన పార్టీలకే సంపూర్ణ మద్దతు ఇస్తామని యాదవ సంఘం నాయకులు పేర్కొన్నారు. పుట్టపర్తిలోని శిల్పారామంలో జిల్లా అధ్యక్షుడు లక్ష్మినరసప్ప అధ్యక్షతన ఆదివారం యాదవుల కులస్తులు రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5 లక్షల యాదవ ఓటర్లు ఉన్నారన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో యాదవులకు ఒక ఎంపీ సీటు, 4 ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. గతంలో తెలుగుదేశం పార్టీ యాదవులకు తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని, దీంతో తగిన ఫలితం అనుభవించిందని గుర్తు చేశారు. నూతన జిల్లా కేంద్రంలో యాదవ కమ్యూనిటీ హాల్ నిర్మాణం, శ్రీకృష్ణ ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. సంఘం జనరల్ సెక్రటరీ ఉమాపతి యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు బాలాంజనేయయాదవ్ నాయకులు వరప్రసాద్, గంగాధర్, నారాయణస్వామి, నరశింహ, కృష్ణమూర్తి, సుధాకర్, శ్రీరాములు, వేమయ్య యాదవ్, కొండయ్య, కిరణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

స్వామి శరణం అయ్యప్ప శరణం



ఉత్సవమూర్తికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

కదిరి టౌన్: శ్రీఅయ్యప్ప స్వామి ఆలయంలో 47వ మండల పూజా కార్యక్రమంలో భాగంగా ఆదివారం ధ్వజారోహణం, మహా పడి పూజ, గురుపూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం అయ్యప్ప ఉత్సవమూర్తికి వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప నామస్మరణతో పట్టణం మార్మోగింది. ఆలయ నిర్వాహకులు డాక్టర్ శంకరయ్య, రమేష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు విరాళం



ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

తనకల్లు: మండల పరిధిలోని బొంతలపల్లిలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న డాక్టర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు వైఎస్సార్ సీపీ నాయకుడు పాలెం సుధాకర్ రూ.20 వేల విరాళం ప్రకటించారు. ఆ మొత్తాన్ని ఆదివారం ఎమ్మార్పీఎస్ నాయకుడు కొండయ్య చేతుల మీదుగా గ్రామస్తులకు అందజేయించారు. శివన్న, నరసింహులు, రామచంద్ర, రమణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జ్యోతులు



అమ్మవారికి బోనాలు తీసుకెళ్తున్న భక్తులు

బత్తలపల్లి: మండల కేంద్రమైన బత్తలపల్లిలోని వడ్డెర కాలనీలో కొలువైన పెద్దకోట్ల పెద్దమ్మకు ఆదివారం రాత్రి వైభవంగా జ్యోతుల మహోత్సవాన్ని నిర్వహించారు. సాయంత్రం ఆలయ కమిటీ సభ్యులు, ప్రజలు కాలనీ నుంచి ఊరేగింపుగా తరలివెళ్లి యల్లమ్మ(కల్లు)ను తీసుకొని వచ్చారు. సుదూర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు బత్తలపల్లిలోని పెద్దమ్మ, సుంకులమ్మ దేవతలను దర్శించుకుని మొక్కులుతీర్చుకున్నారు.

నేడు జ్వాలాతోరణం

కార్తీకమాసం సందర్భంగా బత్తలపల్లిలోని శ్రీలలితా త్రిపుర సుందరీ సమేతా ఓంకారేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం జ్వాలా తోరణం నిర్వహిస్తున్నట్లు ఆలయ శాశ్వత ధర్మకర్త, ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు, జెడ్పీటీసీ కోటి సుధ ఆదివారం తెలిపారు.

కేంద్ర పథకాలను వినియోగించుకోండి



వికసిత్ భారత్ పోస్టర్లు ప్రదర్శిస్తున్న దృశ్యం

పుట్టపర్తి: ప్రధాని నరేంద్రమోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అగ్రీ అడ్వైజరీ చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి సూచించారు. వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా బుక్కపట్నం గ్రామ సచివాలయం ఆవరణలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పేదరిక నిర్మూలన, వ్యవసాయ ఉత్పత్తులు, మహిళల సంక్షేమం, యువతకు స్వయం ఉపాధి తదితర అంశాలపై మాట్లాడారు. అనంతరం పోస్టర్లు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీ శ్రీనివాసులు, మండల గ్రామ సచివాలయాల కన్వీనర్ గోవర్ధన్ రెడ్డి, ఈఓఆర్డీ ఇందిరబాల, హెల్త్ సూపర్‌వైజర్ లింగా రామమోహన్‌చౌదరి, బీజేపీ ప్రతినిధులు చిన్నప్ప, రామాంజనేయులు, ఏసీడీఎస్ సూపర్ వైజర్ కౌసల్య, ఏపీఓ రామకృష్ణారెడ్డి, ఆర్బీకే కన్వీనర్ నాగభూషణ పాల్గొన్నారు.

మానవ హక్కులపై అవగాహన

ధర్మవరం రూరల్: మోటుమర్ల వద్ద వున్న కేజీబీవీ పాఠశాలలో ఐహెచ్ఆర్‌పీసీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి ఆదివారం మానవహక్కులపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, వాటి ద్వారా కలిగే ప్రయోజనాలు వివరించారు. గత సంవత్సరం ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులకు ఈఎస్‌వీఆర్ సేవా ట్రస్టు సహకారంతో నగదు పురస్కారాలు అందజేశారు. ఫరూక్ ఉల్లా, ఇమామ్, ముదసీర్, కలీం పాల్గొన్నారు.

ఆరాధనోత్సవం



కాశిరెడ్డినాయన ఉత్సవమూర్తి

బత్తలపల్లి: మాల్యవంతం సమీపంలోని శ్రీమహాగణపతి, అన్నపూర్ణేశ్వరి, లక్ష్మీనరసింహ సమేత శ్రీకాశినాయన ఆశ్రమంలో ఆదివారం ఆరాధనోత్సవాలు వైభవంగా నిర్వహించారు. స్వామివార్లకు అభిషేకాలు, అలంకరణ, పూజా కార్యక్రమాలను అర్చకులు వెంకటేశ్వరస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం గోపూజ నిర్వహించారు.

పేదలకు చీరల పంపిణీ

ఓడీచెరువు: క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని మండల కేంద్రంలోని సీబీజీ చర్చిలో దార్ల రాజశేఖర్ దంపతులు ఆదివారం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. పాస్టర్ ఎం.జి.జయానందం, సాతాను, బాలరాజు, రఘు, టీచర్ భారతి, ఆశ్వీరాదమ్మ, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కార్తీక దీపోత్సవం

తలుపుల: మండల కేంద్రం ఎగువపేట సమీపంలోని ఏటి గంగమ్మ ఆలయం వద్ద సోమవారం కార్తీక దీపోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ధ్యానంతో ఆరోగ్యం



ధ్యాన మందిరాన్ని ప్రారంభిస్తున్న గోపాల్‌రెడ్డి

బత్తలపల్లి: బత్తలపల్లిలో నూతనంగా నిర్మించిన శ్రీహరిహర పిరమిడ్ ధ్యాన మందిరాన్ని ఆదివారం పిరమిడ్ ధ్యాన కేంద్రం బ్రహ్మర్షి గోపాల్ రెడ్డి, రమాదేవి ప్రారంభించారు. ధ్యానం ద్వారా ప్రశాంతతతో పాటు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. ఎస్‌ఐ పి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

గంగమ్మతల్లి విగ్రహ ప్రతిష్టాపన



గంగమ్మ తల్లి విగ్రహం

తలుపుల: బండ్లపల్లి కాలనీ సమీపంలో నూతనంగా నిర్మించిన కట్టమీద గంగమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన ఆదివారం ఘనంగా జరిగింది. వేద పండితులు వేదమంత్రోచ్చారణ మధ్య ప్రతిష్టాపన చేశారు.

సంక్షిప్త సమాచారం

రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలి



విద్యార్థిని ఫజులుద్దీన్‌ను అభినందిస్తున్న జాన్సియా

ధర్మవరం అర్బన్: రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైన జీవనజ్యోతి పాఠశాల విద్యార్థి ఫజులుద్దీన్‌ను పాఠశాల హెచ్ఎం జాన్సియా ఆదివారం అభినందించారు. ఈనెల 11 నుంచి మదనపల్లిలో జరిగే ఎస్‌జీఎఫ్ అండర్–14 రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో ఫజులుద్దీన్ పాల్గొంటారని ఆమె తెలిపారు.

నేడు చౌడేశ్వరిదేవి జ్యోతుల ఉత్సవం

తాడిమర్రి: పెద్దకోట్ల గ్రామంలో సోమవారం చౌడేశ్వరిదేవి జ్యోతుల ఉత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త, ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

ధర్మవరం రూరల్: కుటుంబ కలహాలతో చెన్నేకొత్తపల్లి మండలం ఆమిదాలకుంట గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డి భార్య మౌనిక ఆదివారం సూపర్ వాస్మోల్ సేవించి ఆత్మహత్యా ప్రయత్నం చేసింది. కుటుంబ సభ్యులు గమనించి ఆమెను అనంతపురం తరలించారని పోలీసులు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీ ఎంపిక

ధర్మవరం: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ధర్మవరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీని మండల కన్వీనర్ శాన్వాజ్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ రంగన అశ్వర్థనారాయణ ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. ధర్మవరం పట్టణ అధ్యక్షుడిగా షమీవుల్లా, ముదిగుబ్బ కన్వీనర్‌గా ప్రభాకర్, తాడిమర్రి కన్వీనర్‌గా గిరి, బత్తలపల్లి కన్వీనర్‌గా ముక్తియార్, ధర్మవరం రూరల్ కన్వీనర్‌గా జంగంలను ఎంపిక చేశారు.

పోతలయ్యస్వామికి ప్రత్యేక పూజలు

కనగానపల్లి: దాదులూరు గ్రామంలో వెలసిన పోతలయ్యస్వామికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి, స్వామికి బోనాలు సమర్పించారు. అనంతరం ఆలయంలోని పోతలయ్య, చెన్నేకేశవస్వాములకు పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు.